క్లుప్తంగా

నేటి నుంచి నారాయణ స్వామి ఉత్సవాలు

రాజోళి: మండల కేంద్రంలో వెలిసిన శ్రీ వైకుంఠ నారాయణ స్వామి కల్యాణ మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 17 తేదీన అంకురార్పన, స్నపనం సేవ, పంచామృతాభిషేకంతో మొదలై ప్రత్యేక పూజలు, విశేష కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 20వ తేదీ కల్యాణోత్సవం, 22న రథోత్సవం నిర్వహించనున్నట్లు నేటి నుంచి ఆలయ కమిటీ, భక్త బృందంతో విశేష కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కమిటీ తెలిపింది.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కేటీదొడ్డి: మండలంలోని పాగుంట శివారులో సజ్జపురం గ్రామానికి చెందిన కురువ వీరన్న ఆదివారం ఉదయం 8 గంటల సమయంలో శ్మశాన వాటిక వద్ద నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా, ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పట్టుకున్నారు. అతన్ని పట్టుకొని ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అడవిరావల్‌చెర్వులో వీధిలైట్లు ఏర్పాటు



మల్దకల్: మండలంలోని అడవిరావల్‌చెర్వు గ్రామంలో ఆదివారం నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకుల ఆధ్వర్యంలో వీధిలైట్లు ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌కు చెందిన స్ట్రీట్ కాజ్ స్వచ్ఛంద సేవా సంస్థ వారి సహకారంతో నడిగడ్డ హక్కుల పోరాట సమితి నాయకులు గొంగళ్ళ రంజిత్‌కుమార్ గ్రామంలో వీధిలైట్లు ఏర్పాటు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో బుచ్చిబాబు, ప్రేమ్‌రాజు, రంగస్వామి, పరశురాం, చింత కిష్టన్న, స్ట్రీట్ కాజ్ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు పవన్, శ్రీవర్ధన్‌రెడ్డి, జాహ్నవి, సంజన, సౌమ్య, గుప్తా, రిషిత, అమూల్య, సత్య, తిమ్మప్ప, రాజు, రవి, నరసింహ, కృష్ణ పాల్గొన్నారు.

నిరుపయోగంగా కమ్యూనిటీ భవనం



మల్దకల్: మండలంలోని బిజ్వారంలో బీసీ కమ్యూనిటీ భవనం నిరుపయోగంగా ఉంది. 17ఏళ్ల క్రితం రూ.6లక్షల వ్యయంతో నిర్మించిన ఈ కమ్యూనిటీ భవనం ఎస్సీ కాలనీకి సమీపంలో ఉండటంతో బీసీ కాలనీ వాసులు ఈ కమ్యూనిటీ భవనాన్ని వినియోగించకపోవడంతో నిరుపయోగంగా ఉండిపోయింది. దీంతో ఈ కమ్యూనిటీ భవనం యాచకులకు, మద్యం ప్రియులకు ఆవాసంగా మారింది. లక్షలు వెచ్చించి నిర్మించినా కమ్యూనిటీ భవనం నేడు శిథిలావస్థకు చేరింది. అధికారులు స్పందించి కమ్యూనిటీ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మినీ వంతెనపై గుంతలు పూడ్చండి



మానవపాడు: మానవపాడు మండల కేంద్రం నుంచి గోకులపాడు, చంద్రశేఖర్‌నగర్, శ్రీనగర్, కొర్విపాడు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి మినీ వంతెనపై మూడు పెద్ద గుంతలు ఏర్పడి ప్రయాణించడానికి ప్రమాదకరంగా ఉన్నాయి. భారీ వర్షాలు కురిస్తే వంతెన గుంతలు లోపలికి కుంగిపోయే ప్రమాదం ఉంది. ప్రమాదాలు జరుగకముందే అధికారులు స్పందించి మినీ వంతెనపై గుంతలను పూడ్చేవిధంగా చర్యలు తీసుకోవాలి.

పట్టు తప్పితే అంతే!

ప్రమాదమని తెలిసినా కూలీలు తప్పని పరిస్థితుల్లో పనుల కోసం ఆటోలో ఒక ఊరి నుంచి మరో ఊరికి వేలాడుతూ ప్రయాణిస్తుంటారు. పొరుగింటి కూర రుచి ఎక్కువ అన్నట్లుగా కూలీలకు స్థానికంగా పనులు లభిస్తున్నప్పటికీ ఆటో వ్యక్తుల అత్యాశతో ఇలా మరో ఊరికి లెక్కక్కకు మించి సంఖ్యతో ప్రయాణిస్తుంటారు. కూలీలతో పాటు ఆటో కిరాయిని రైతు సపరేటుగా చెల్లించాల్సి ఉంటుంది. ప్రమాదకరంగా కూలీలను తరలిస్తున్న క్రమంలో ఏదైనా జరుగరానిది జరిగితే ఆ కుటుంబం రోడ్డున పడాల్సి ఉంటుంది. ఇవేవి పట్టించుకోకుండా మహిళా కూలీలు ఇలా ప్రమాదకరంగా ఆటోలో ప్రయాణిస్తున్న దృశ్యం గట్టు–మల్దకల్ దారిలో కన్పించగా 'సాక్షి' క్లిక్ మన్పించింది.

– గట్టు



వానాకాలం.. ఆశాజనకం

- వర్షాల రాకతో జోరందుకున్న విత్తన ప్రక్రియ
- ఈ ఏడాది కంది సాగుపై రైతుల ఆశలు
- ఇప్పటికే వేలాది ఎకరాల్లో పత్తి, కంది విత్తిన రైతులు



తూర్పుగార్లపాడు శివారులో విత్తనాలు వేస్తున్న రైతు

రాజోళి: ఈ వానాకాలం సీజన్ ఆశాజనకంగా సాగయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాష్ట్రంలో రుతుపవనాలు ప్రవేశించడం, సీజన్ ఆరంభం నుంచే వర్షాలు కురుస్తుండటంతో అన్నదాతలు రెట్టించిన ఉత్సాహంతో సాగు మొదలు పెట్టారు. గతేడాది చేసిన నష్టం నుంచి బయట పడేందుకు అన్నదాతలు బాధలు వరుణడి రూపంలో తీరనున్నాయి. గతేడాది పత్తి, కంది తదితర పంటలు వేసి సరైన దిగుబడి లేక లక్షల రూపాయలు నష్టపోయిన రైతులు ఈ ఏడాది తమ నష్టాన్ని పూడ్చుకునేందుకు సిద్ధమయ్యారు. తప్పకుండా ప్రకృతి తమ కష్టాన్ని వృథా కానివ్వదని, రైతులు భావించి విత్తనాలు విత్తుతున్నారు. గతంలో వేసిన విత్తనాలతో పాటు ఇతర విత్తనాలు వేసి నష్టాన్ని పూడ్చుకునేందుకు సన్నద్ధులవుతున్నారు.

కందికి పెరుగుతున్న ఆదరణ..

గతేడాది కంటే ఈ ఏడాది కంది పంట సాగు చేసేందుకు మండలంలో రైతులు ఆసక్తి చూపుతున్నారు. గతంలో కంది పంట వేసినప్పటికీ అవి చేతికి రాకపోగా, పెట్టిన పెట్టుబడి సైతం రాక రైతులు లబోదిబోమన్నారు. ఈ ఏడాది రైతులు కంది పంటను సాగు చేసేందుకు ఎక్కువ మొత్తంలో విత్తనాలు వేశారు. మండలంలో మొత్తం 21వేల ఎకరాలకు పైగా వానాకాలం విస్తీర్ణం ఉండగా, గతేడాది పత్తి పంటను 7,500 ఎకరాలకు పైగా సాగు చేశారు. కంది పంటను 2,500 ఎకరాలకు పైగా సాగు చేశారు. మిగతా విస్తీర్ణంలో మొక్కజొన్న, జొన్న, వరి పంటలను సాగు చేశారు. పంటలను సాగు చేసేందుకు గతేడాది తుంగభద్రకు ఎగువ నుంచి వరద నీరు వస్తుందనే నమ్మకం ఉన్నప్పటికీ అది కుదరలేదు. తాజాగా సీజన్ ప్రారంభమై నెల గడవక ముందే పత్తి, కంది విత్తనాలు జోరుగా విత్తుతున్నారు. గతేడాది మాదిరి కాకుండా ఈ ఏడాది అనుకూల వర్షాలు ఉండటం, రైతులు కూడా ఇప్పటికే గతంలో కంటే ఎక్కువ మొత్తంలో సేద్యాలు చేసి సాగు మొదలు పెట్టడం చూస్తే వానాకాలం సీజన్ రైతులకు కలిసివచ్చేలాగా కనిపిస్తోంది. కౌలు రైతులు సైతం ఉత్సాహంగా భూములకు కౌలు చెల్లించి విత్తనాలు వేస్తున్నారు.

ఎక్కువ మొత్తంలో కంది సాగు..

గతేడాది కంటే ఈ ఏడాది కంది విత్తనాలు వేసే వారి సంఖ్య పెరిగే అవకాశాలున్నాయని వ్యవసాయ అధికారులు సైతం అంచనా వేస్తున్నారు. గతేడాది ఈ సమయానికి సరైన వర్షాలు లేకపోగా, విత్తనాలు కూడా వేయలేదు. ప్రస్తుతం వర్షాలు కురవడంతో పాటు ఈ సమయానికే రైతులు కంది, పత్తి విత్తనాలు జోరుగా విత్తారు. ఇప్పటికే కురిసిన వర్షాలకు ఈ సమయానికే వేలాది ఎకరాలల్లో విత్తనాలు వేయగా, ముందు ముందు ఇంకా ఎక్కువ మొత్తంలో పడే అవకాశాలున్నాయని రైతులు, అధికారులు అంటున్నారు. గతంలో కంది వేసినప్పటికీ కొంత నష్టం వాటిల్లిన కారణంగా నష్టపోయిన రైతులతో సహా మరి కొందరు ముందుగానే కంది, పత్తి విత్తనాలు నాటారు. అనుకూల వర్షాలు ఉన్న నేపథ్యంలో తాము ఆశించిన విధంగా పంటలు పండుతాయని, రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రైతులు తక్కువ సారం ఉన్న తమ నేలల్లో జీలుగను వేసి పొలంలో సారం వచ్చే విధంగా భూమిని తయారు చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఇప్పటికే రైతులు 70 క్వింటాళ్ల మేర జీలుగను భూమిలో తొక్కి పొలంలో సారం పెంచుకున్నారు.

ఎకరంలో పత్తి వేశాం..



నేను ఎకరం పొలంలో పత్తి విత్తనాలు వేశా. గత ఏడాది ప్రతి కూల వర్షాల కారణంగా నష్టపోయాను. ఈ ఏడాది అనుకూల వర్షా లు కురుస్తుండటంతో ముందుగానే పత్తి విత్తనాలు వేశాను. గతంలో నష్టపోయిన నేను ఈ ఏడాది బయట పడతాననే నమ్మ కం ఉంది. సీజన్ మొదటి నుండే ఆశాజనకంగా ఉండటంతో పత్తి విత్తనాలు వేశాను. తప్పకుండా మంచి దిగుబడి వస్తుందనే నమ్మకం ఉంది.

– రాజన్న, రైతు, తూర్పుగార్లపాడు

జోరుగా విత్తనాలు వేస్తున్నారు



గతేడాది కంటే ఎక్కువగా ఈ ఏడాది కంది, పత్తి విత్తనాలు జోరుగా వేస్తున్నారు. భూముల్లో సారం కోసం జీలుగ ఎక్కువ మొత్తంలో తీసుకున్నారు. ముందు ఇంకా ఎక్కువగా పడే అవకాశాలున్నాయి. రైతులు ఈ ఏడాది గతం కంటే ఎక్కువ ఉత్సాహంతో సాగును మొదలు పెట్టారు.

– చంద్రశేఖర్, వ్యవసాయ అధికారి, రాజోళి

కొలువుదీరిన విశ్వేశ్వరయ్య పాలకవర్గం



ఎన్నికైన పాఠశాల విద్యా కమిటీ నూతన కార్యవర్గం

గద్వాల: మూడు దశాబ్దాల చరిత్ర కలిగి, గద్వాల గంజ్ మర్చంట్స్ అసోసియేషన్ సౌజన్యంతో నడుస్తున్న విశ్వేశ్వరయ్య మెమోరియల్ హైస్కూల్ విద్యా కమిటీ నూతన పాలకవర్గం కొలువుదీరింది. ఆదివారం సాయంత్రం పాఠశాల ఆవరణలో పాలకవర్గం ప్రమాణ స్వీకారోత్సవాన్ని ఏర్పాటు చేశారు. పాఠశాల చైర్మన్ అండ్ కరస్పాండెంట్‌గా సాయిబాబ ప్రమాణ స్వీకారం చేశారు. వైస్ చైర్మన్‌గా జయప్రకాష్, గంజ్ మర్చంట్స్ అసోయసియేషన్ అధ్యక్షుడిగా మహేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా విజయ్‌మోహన్, కోశాధికారిగా తారానాథ్, డైరెక్టర్లుగా నర్సింహులు, రాముడు, భాస్కర్, రామంజనేయులు ప్రమాణ స్వీకారం చేసిన వారిలో ఉన్నారు. పాలకవర్గాన్ని పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల నూతన చైర్మన్ సాయిబాబ మాట్లాడారు. పాఠశాలను మరింత అభివృద్ధి పర్చడానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గతంలో పనిచేసిన పాలకవర్గ పెద్దల సలహాలతో ముందుకు వెళ్తానని చెప్పారు. మెరుగైన విద్యా ప్రమాణాలతో పాఠశాలను జిల్లాలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు, నాయకులు ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరై నూతన కార్యవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల మాజీ చైర్మన్ రాధాకృష్ణ, వివిధ పార్టీల నాయకులు, గంజ్ వ్యాపారులు పాల్గొన్నారు.

ఎస్‌ఐ బదిలీ

గట్టు: గట్టు ఎస్‌ఐగా పని చేస్తున్న రామకృష్ణ నారాయణ పేట జిల్లాకు బదిలీ అయ్యారు. వనపర్తి జిల్లా నుంచి మల్లేష్ గట్టు ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ మేరకు పోలీస్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. గట్టు ఎస్‌ఐగా పని చేస్తున్న రామకృష్ణ ఈ ఏడాది ఫిబ్రవరిలో బాధ్యలు చేపట్టారు. అంతలోనే బదిలీ అయ్యారు.

కోతకు గురైన రోడ్డు



మానవపాడు: మండలంలోని మానవపాడు నుంచి చెన్నిపాడుకు వెళ్లే రహదారిలో మధ్యలో మినీ వంతెన ఉంది. కొన్ని రోజులుగా కురిసిన వర్షానికి కోతకు గురైంది. రోడ్డు గుండా ప్రయాణించాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. రాత్రి సమయంలో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు కూడా చేయకపోవడంతో రోజురోజుకు మరింత కొతకు గురవుతోంది. నాలు గు చక్రాల వాహనాలు రోడ్డు గుండా ప్రయాణించాలంటే ప్రమాదం సంభవించే అవకాశం ఉంది. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

బక్రీద్ పండుగను ప్రశాంతంగా చేసుకోవాలి

ఎర్రవల్లిచౌరస్తా: ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగ చేసుకోవాలని ఇటిక్యాల ఎస్‌ఐ వెంకటేష్, కోదండాపురం ఎస్‌ఐ స్వాతిలు ఆదివారం సూచించారు. గోవధ నిషేధం ఉన్నందున పండుగ పేరుతో ఎక్కడా గోవులను వధించడం చేయరాదన్నారు. చట్టాన్ని అతిక్రమించి ఎక్కడైనా గోవులను వధిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి గ్రామంలో మత పెద్దలతో కమిటీని ఏర్పాటు చేసుకొని ప్రశాంతతకు భంగం కలగకుండా పండుగ నిర్వహించుకోవాలని వారు కోరారు.

వామ్మో.. వసతి గృహాలు

- సమస్యలకు నిలయంగా వసతిగృహాలు
- పాఠశాలలు ప్రారంభమైన పట్టింపు కరువు
- విద్యార్థులకు ఇబ్బందులు తప్పేలా లేవు



బీసీ కాలనీలో ప్రభుత్వ బాలుర వసతిగృహం

గద్వాల అర్బన్: ప్రభుత్వం ఉన్నత విద్యను అందించాలనే సదుద్దేశ్యంతో వసతి గృహాలు ఏర్పాటు చేసింది. గద్వాల పట్టణంలోని బీసీ, ఎస్సీ వసతిగృహాలు సమస్యలకు నిలయంగా మారాయి. పాఠశాలలు పునః ప్రారంభమైనా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. దీంతో విద్యార్థులకు తిప్పలు తప్పేలా లేవు.

ధ్వంసమైన కిటికీలు, తలుపులు

గద్వాల పట్టణంలో 6ఎస్సీ, 4బీసీ వసతి గృహాలు ఉన్నాయి. వసతి గృహంలో మెరుగైన సౌకర్యాలు ఉంటాయని తల్లిదండ్రులు తమ పిల్లలను వసతిగృహాల్లో చేర్పిస్తుంటారు. గద్వాల పట్టణంలోని వసతిగృహాల్లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. దీంతో దూరప్రాంతాల నుంచి వచ్చి చదువుకునే విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. వచ్చిన విద్యార్థులకు ఇబ్బందులు తప్పేలా లేవు. సరైన మరుగుదొడ్లు లేకపోవడం, కొన్ని చోట్ల ధ్వంసమైన మరుగుదొడ్లు ఉన్నాయి. తలుపులు, కిటికీలు, తలుపులు ధ్వంసమయ్యాయి. అసలే వర్షాకాలం కాగా దోమలు బెడద తదితర వాటితో సీజనల్ వ్యాధులు సంభవించే అవకాశం ఉంది.

వసతిగృహాల్లో సమస్యలు స్వాగతం

వేసవికాల సెలవులు ముగిశాయి. బుధవారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. వసతి గృహాల్లో మాత్రం సమస్యలు అలాగే ఉన్నాయి. దూర ప్రాంతాల్లో నుంచి వచ్చి వసతిగృహాల్లో ఉండి చదువుకునే విద్యార్థులు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి దాపురించింది. వసతిగృహాల్లో కిటికీలకు అద్దాలు ధ్వంసం కావడంతో దస్తులు, దుప్పట్లు అడ్డంగా పెట్టారు. ధ్వంసమైన తలుపులు, కిటికీలు, మరుగుదొడ్లు, స్విచ్ బోర్డు, మరుగుదొడ్లు ధ్వంసం కావడంతో ఆరుబయట బహిర్భూమికి వెళ్లాల్సి వస్తోంది. వేసవి సెలవుల్లో మరమ్మతులు చేపట్టి పాఠశాలల ప్రారంభానికి అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది. పాఠశాలలు ప్రారంభమైనా ఇప్పటి వరకు సౌకర్యాలు కల్పించడంపై సంక్షేమ శాఖ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. జిల్లా స్థాయి ఉన్నతాధికారులు ఉన్న జిల్లా కేంద్రంలోనే వసతిగృహాల పరిస్థితి ఈ విధంగా ఉంటే, మండలాల్లోని వసతిగృహాల్లోని పరిస్థితి ఏ మేరకు ఉంటుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వసతిగృహాల్లో సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.



ధ్వంసమైన అద్దాలు, కిటికీలు

విద్యార్థులకు వసతులు కల్పించాలి



వసతిగృహాల్లో చదువుకునే విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలి. గదులు, బాత్‌రూంలు పరిశుభ్రంగా ఉండాలి. విద్యార్థులకు నోట్ పుస్తకాలు, కాస్మోటిక్ చార్జీలు, మెటీరియల్ అందించడంతో పాటు నాణ్యమైన భోజనం అందించాలి. హాస్టళ్ల ప్రారంభం కావడంతో వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలి. ఎలాంటి ఇబ్బందులు కలుగుకుండా వార్డెన్లు, ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలి.

– హరీష్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు

అనర్హులకు లేబర్ కార్డులివ్వొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహ

ధరూరు: కార్మిక విభాగంలో పని చేసే వారికి కాకుండా అనర్హులకు లేబర్ కార్డులివ్వొద్దని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నర్సింహ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో జనరల్ బాడీ మీటింగ్‌లో కార్మికులనుద్దేశించి ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ రంగంలో పని చేయని వారికి కూడా కొందరు దళారులు లేబర్ కార్డులు ఇప్పిస్తున్నారన్నారు. జిల్లాలో మొత్తం 30వేల మంది భవన నిర్మాణ కార్మికులు ఉంటే 50వేల లేబర్ కార్డులు జారీ అయ్యాయన్నారు. లేబర్ కార్డు ద్వారా పొందే లబ్ధిని ఇతరులు పొందే అవకాశాలున్నాయని, సంబంధిత శాఖ అధికారులు దీనిపై దృష్టి సారించాలని కోరారు. పని ప్రదేశాల్లో చోటు చేసుకునే ప్రమాదాల ద్వారా పొందే లబ్ధిని ఇతరులు పొందే అవకాశం ఉందని తెలిపారు. లేబర్ కార్డు జారీ విషయంలో ఉన్నతాధికారులు దృష్టి కేంద్రీకరించాలని కోరారు. పక్కదారి పట్టకుండా ఉండేందుకు అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హమాలీ సంఘం నాయకులు నర్సింహులు, తిమ్మప్ప, ప్రవీణ్, ఆంజనేయులు, గోవిందు, మోష పాల్గొన్నారు.

ముగిసిన ఓపెన్ టెన్నీస్‌బాల్ క్రికెట్



బహుమతి స్వీకరిస్తున్న క్రీడాకారులు

అలంపూర్ రూరల్: మండలంలోని క్యాతూర్‌లో ఈ నెల 4 నుంచి ప్రారంభమైన ఓపెన్ టెన్నీస్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసినట్లు నిర్వహకులు తెలిపారు. దాతల సహకారంతో పోటీలు నిర్వహించినట్లు నిర్వాహకులు మహ్మద్ రఫీ, అజీజ్, బ్రహ్మ, ఖదీర్, రఫీ, ఖాజా, రఫీ, మంజునాథ్‌లు తెలిపారు. మొదటి బహుమతి ఇమాంపూర్ టీం, రెండో బహుమతి జలీల్ ఎలెవన్ టీం, మూడో బహుమతి బీస్మిల్లా టీం, క్యాతూర్, నాల్గో బహుమతి సీ టీం క్యాతూర్‌లు గెలిచినట్లు వారు తెలిపారు.

రోడ్డు పక్కన చెట్లకు రక్షణ కరువు



గట్టు-మల్దకల్ దారిలో రోడ్డు పక్కన నరికేసిన చెట్ల కొమ్మలు



గోకులపాడు నుంచి చంద్రశేఖర్‌నగర్ గ్రామానికి వెళ్లే రోడ్డు కుండా నిరికేసిన చెట్లు

గట్టు: రోడ్డు పక్కన చెట్లకు రక్షణ కరువైంది. ఎవరిష్టమొచ్చినట్లు వారు రోడ్డు పక్కన పెరుగుతున్న చెట్లను నరికేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా చెట్లు కన్పించకుండా పోయే పరిస్థితి తలెత్తింది. రోడ్లకు ఇరువైపులా గత ప్రభుత్వ హయాంలో హరిత హారం ద్వారా మొక్కలు నాటారు. ప్రస్తుతం అవి పెరిగి పెద్దవిగా మారాయి. రోడ్డు పక్కనే పొలాలను సాగు చేసుకుంటున్న కొంత మంది రైతులు సాగుకు అడ్డుగా ఉన్నాయని, చెట్లను నరికేస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో రోడ్డుకు ఇరువైపులా చెట్లు కన్పించని పరిస్థితి ఏర్పడవచ్చని వాహనదారులు వాపోతున్నారు. గట్టు–మల్దకల్, గట్టు–ఆలూరు రూట్లో రోడ్డుకు ఇరువైపులా పచ్చని చెట్లు కనువిందు చేస్తున్నాయి. చెట్ల కింద చెత్తకు నిప్పు పెట్టడడంతో కొన్ని చెట్లు చనిపోతుండగా, మరి కొన్ని చోట్ల చెట్లను నరికేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లకు ఇరువైపులా పచ్చగా పెరుగుతున్న చెట్లు కనుమరుగు కాకుండా చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

మొక్కలు నాటారు.. చెట్లు నరికారు

మానవపాడు: పర్యావరణ పరిరక్షణకోసం మొక్కలను పెంచుతున్నారు. హరితహారంలో భాగంగా మొక్కలను రోడ్డుకు ఇరువైపులా నాటుతున్నారు. అవి ఏపుగా పెరిగిన వెంటనే విద్యుత్ తీగలకు తగులుతున్నాయని నరికేస్తున్నారు. ముందస్తు ప్రణాళికలు లేకుండా అధికారులు ఎక్కడపడితే అక్కడ చెట్లను నరికేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అనాథ మహిళకు ప్రతినెల సాయం



అచ్చమ్మ అవ్వకు ఆర్థికసాయం అందజేస్తున్న శాంతినగర్ సేవాసమితి సభ్యులు

శాంతినగర్: ఎవరూ లేని అచ్చమ్మ అవ్వకు ప్రతి నెలా సాయం చేసేందుకు కృషి చేస్తామని శాంతినగర్ సేవాసమితి వడ్డేపల్లి సభ్యులు అన్నారు. వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్‌లో ఎవరూ లేక అనాథగా ఉన్న అచ్చమ్మ అవ్వకు శాంతినగర్ సేవాసమితి వడ్డేపల్లి సభ్యులు ఆదివారం రూ.4 వేలు ఆర్థికసాయం అందజేశారు. వృద్ధురాలికి అవసరమైన మౌలిక వసతులు కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేద అయిన అచ్చమ్మ అవ్వకు గత కొన్నేళ్లుగా సేవాసమితి అండగా ఉందన్నారు. ఆధార్ కార్డు లేని కారణంగా పెన్షన్ రావడంలేదని, అందువల్ల వృద్ధురాలి అవసరాల కోసం ఆర్థికసాయం అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు షేక్ అస్లాం షరీఫ్, దాసువరం నాగరాజు, దొండె రమేష్, మాలిక్, ఆటో ఖలీల్, డిష్ గౌస్‌లు పాల్గొన్నారు.

రోడ్డు పరిస్థితి ఇలా.. నడిచేదెలా?



తనగలలో అధ్వానంగా ఉన్న అంతర్గత రహదారి

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని తనగల గ్రామంలో ఎస్సీ కాలనీలోని అంతర్గత రహదారులు అధ్వానంగా మారాయి. వర్షపు నీరు గుంతల్లో నిలిచి దుర్గంధం వెదజల్లడంతో ముక్కు మూసుకుని నడవాల్సిన పరిస్థితి ఉందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డ్రెయినేజీ కాల్వల్లోని మురుగు జేసీబీతో తీయించి రోడ్డుపైనే వేయడంతో బురదమయమై వాహనాలు అదుపుతప్పుతున్నాయి. మురుగు నిలిచి దోమల ఉధృతి ఎక్కువై అనారోగ్యాల బారిన పడుతున్నారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ సెక్రటరీ, సిబ్బంది స్పందించి గుంతల్లో వర్షపునీరు నిల్వకుండా చర్యలు చేపట్టి, ఎర్రమట్టి వేయించి ఇబ్బందులు తొలగించాలని ఎస్సీ కాలనీ వాసులు కోరుతున్నారు.

చినుకు పడితే చిత్తడి!

మానవపాడు: పెద్దపోతులపాడు పాఠశాల పక్కనే చినుకు పడితే చిత్తడి రోడ్డుమార్గం దర్శనమిస్తోంది. శనివారం మండలంలోని పెద్దపోతులపాడు పాఠశాల పక్కనే ముందు భాగంలో రోడ్డు చినుకు పడితే చిత్తడి మార్గంగా కనిపిస్తోంది.